క్లుప్తంగా

క్రికెట్‌కిట్ల పంపిణీ



క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో యువకులకు క్రికెట్ కిట్లను ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహాన్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా యువకులతో క్రికెట్ ఆడి సందడి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, రాంశెట్టి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జిన్నారంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని 254హెచ్ఎండీఏ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలను చేపట్టడంతో బుధవారం హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. ఈ స్థలాల్లో హిందువుల దేవాలయంతో పాటు చర్చి నిర్మాణాలు కూడా ఉండటంతో నిర్మాణాలను తొలగించొద్దని క్రిస్టియన్లు, హిందువులు అడ్డుకొని స్థానిక ప్రజలతో కలిసి నిరసన చేపట్టారు. దీంతో ఇరు వర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. చర్చి, హిందూ దేవాలయాల నిర్మాణాలను మినహాయించి మిగతా నిర్మాణాలను అధికారులు జేసీబీలతో కూల్చివేయించారు.

జిన్నారంలో...

జిన్నారంలోని 1002 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదులు రావటంతో తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయశంకర్ నారాయణ నిర్మాణాలను కూల్చివేయించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే సహించేదిలేదని తహసీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

యాసంగి పంటల నమోదు పరిశీలన



దామర్‌గిద్దాలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): యాసంగిలో పంటల నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి ఏఈఓలకు సూచించారు. మండల పరిధిలోని దామర్‌గిద్దా, తుర్కవడ్‌గాంలో పంటల నమోదును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటల నమోదుతో పాటు త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఏఈఓ సంధ్యారాణి ఘణ్‌పూర్‌లో పంటల నమోదులో పాల్గొన్నారు. అదే విధంగా దామర్‌గిద్దా, తుర్కవడ్‌గాంలో ఏఈఓలు హన్మండ్లు, వెంకటేశం పంటల నమోదులో పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎస్‌డీ నాయకులు బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సైనిక్‌దల్ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ జిన్నారంలో ఆధార్ కేంద్రం లేకపోవటంతో అన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

మనూరు(నారాయణఖేడ్): ఈ నెల 12న యువజన దినోత్సవం సందర్భంగా ఎస్‌బీఐ, భవిష్య భారత్ ఆధ్వర్యంలో రాయిపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జహంగీర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బ్లడ్ డోనర్స్ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

- అమీన్‌పూర్ పట్టణంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- కబ్జాదారులకు సహకరిస్తున్నారని రెవెన్యూ అధికారులపై ఆరోపణలు
- అన్యాక్రాంతమవుతున్న విలువైన ప్రభుత్వ భూములు
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో ప్రభుత్వ అసైన్డ్ చెరువుల భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ కబ్జాలకు అధికారుల నుంచి పూర్తి మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఈ కబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ స్పందన కరువైంది. ఎన్నికలకు ముందు బీరంగూడలోని దేవాలయం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను కుల సంఘాలకు పంచిపెట్టారు. కానీ.. స్థానిక నాయకులు 100 గజాలను ప్లాటుగా చేసి అమ్ముతున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని తెలిసినా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతే కాకుండా మున్సిపాలిటీ నుంచి ఆ ఇళ్లకు ఇంటి నంబర్లు సైతం వస్తున్నాయి.



తొలగించిన ప్రహరీని పునర్ నిర్మిస్తున్న దృశ్యం

విలువైన భూములు అన్యాక్రాంతం..

మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో కోట్ల రూపాయలు విలువ చేసే అత్యంత విలువైన అమీన్‌పూర్ పట్టణ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వాల నారాయణరావు వెంచర్‌లో నవ్య ఎదురుగా ఇటీవల ప్రహరీ కూడా నిర్మించారు. దీంతో సమాచారం తెలుసుకున్న అధికారులు తొలగించారు. అయినప్పటికీ మళ్లీ ప్రహరీని పునర్ నిర్మిస్తున్నారు.

ప్లంబర్‌కు ఈనాం..

అమీన్‌పూర్ పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో వాల నారాయణరావు వెంచర్ ఏర్పాటు చేసి ఎటువంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. అంతేకాకుండా ఎలాంటి డాక్యుమెంట్లు, అనుమతులు లేకపోయినా నిర్మాణాలు చేపడతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో ప్లంబర్‌గా పనిచేసిన వ్యక్తి ఇదే వెంచర్‌లో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. అదేవిధంగా బచ్‌పన్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మాణాలకు మున్సిపల్ అధికారులను అనుమతులు ఇవ్వడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలయ భూమిని కాపాడాలి



అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. అయితే తమ ప్రయత్నం దేవాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరుతున్నాం. అందుకోసం ఇటీవల కౌన్సిలర్లతో కలిసి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం కూడా సమర్పించాం. అయినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శివాలయం సమీపంలో సర్వే నెంబర్ 993లో అక్రమ నిర్మాణాలను జరుగుతున్నాయి.

– లింగంగౌడ్, బీరంగూడ గ్రామం

పోలీసుల సహకారం తీసుకుంటాం



అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకొని నిర్మాణాలను కూల్చివేయిస్తాం. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసేవారిపై కేసులు నమోదులు చేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం.

– రఘునాథ్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అమీన్‌పూర్

'ఉపాధి హామీ'ని పకడ్బందీగా చేపట్టండి

- పనుల్లో పారదర్శకత పాటించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం పనులపై ఖేడ్ మండల పరిషత్ కార్యాలయంలో 13వ విడత ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చేసిన పనులకు సక్రమంగా బిల్లులు అందలేదని, తమకు న్యాయం చేయాలని కూలీలు కోరినట్లు సోషల్ ఆడిట్ బృందం సభ్యులు తెలిపారు. అదేవిధంగా పలు గ్రామాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలను సోషల్ ఆడిట్ బృందం సభ దృష్టికి తీసుకువచ్చింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ఉన్నత లక్ష్యాలతో చేపట్టడం జరిగిందన్నారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్‌రావు, ఎంపీపీ చాందీబాయి చౌహాన్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, ఉపాధిహామీ ఏపీవో, టీఏ, మేట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన నివాసంలో టీపీటీఎఫ్, ఎస్టీయూ యూనియన్లకు సంబంధించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీవైఆర్‌ఎఫ్ సేవలను విస్తరిస్తాం



విజేతలకు చెక్కులను ప్రదానం చేస్తున్న పీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎల్లారెడ్డి

జోగిపేట(అందోల్): పేద ప్రజలకు అండగా పీవైఆర్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. జోగిపేట వాసవీ కల్యాణ మండపంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా స్వప్నకు రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా యాదలక్ష్మికి రూ.10వేలు తృతీయ బహుమతి చిట్యాల మానసకు రూ.5వేల నగదును చెక్కుల రూపంలో డాక్టర్ ఎల్లారెడ్డి అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుగుణ, శ్రీలత జడ్జిలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మ ప్రధాన కార్యదర్శి మంజుల, సహాయ కార్యదర్శి నాగమణి, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌గౌడ్, జిల్లా నాయకులు ప్రభాత్, నాయకులు మహేందర్, శివచందర్, శ్యామగౌడ్, మాణయ్య పాల్గొన్నారు.

మాదారంలో వైద్య శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి చెందిన వైద్యులు బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలను చేసి అవసరమైన మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం పలువురు వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉచితవైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిత, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన మారుతి కులకర్ణికి(51) కొంతకాలంగా మానసికస్థితి సరిగా లేకపోవడంతో ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు నిద్రమాత్రలు వేసుకొని పడుకునేవాడు. ఈ క్రమంలో మారుతి మంగళవారం ఉదయం నిద్రమాత్రలు వేసుకొని అపారకస్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు కుమారుడు శ్రవణ్ కులకర్ణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బోరుమోటార్ల ఏర్పాటు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో సీఎస్ఆర్ నిధులతో రైతులకు ఉపయోగపడేవిధంగా సర్పంచ్ సరిత, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మూడు బోరుమోటార్లను వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా బోరుమోటర్లు వేయించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు భగవాన్‌సింగ్, భాస్కర్ గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

కంది(సంగారెడ్డి): ఇసుక ఫిల్టర్ల వద్ద గొడవపడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బ్యాతోల్ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్ అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇసుక ఫిల్టర్ల వద్ద వాహనాల విషయమై గొడవ పడ్డారు. దీంతో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తండాల్లోని సమస్యలు పరిష్కరించాలి

నారాయణఖేడ్: గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి శరత్‌కు లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గంలోని అనేక తండాలకు రోడ్డు సౌకర్యం లేదని, కొన్ని తండాలకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని వివరించారు. దీంతో అన్ని తండాలకు రోడ్డు సౌకర్యం, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సురేష్, మోహన్, ప్రేమ్‌సింగ్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కస్తూర్బా గాంధీలో ముగ్గుల పోటీలు



మండల కేంద్రం కంగ్టిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచినవారిని ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

కంగ్టి(నారాయణఖేడ్):

సంకాంత్రి సంబురం



సిర్గాపూర్ కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలలో సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారిణి లలిత ఆధ్వర్యంలో విద్యార్థినులు ముగ్గులు వేశారు. హరిదాసుల వేషధారణలో పలువురు విద్యార్థినులు ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చినవారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

– కల్హేర్(నారాయణఖేడ్)

ఎల్‌ఐసీ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

జహీరాబాద్ టౌన్: ఎల్‌ఐసీ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్(ఐసీఈయూ) కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఏకపక్ష వైఖరికి నిరసనగా బుధవారం స్థానిక కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎల్‌ఐసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఆగస్టు 2022 నుంచి జరగవాల్సిన వేతన సవరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, నూతన పెన్సన్ స్కీం కింద 10నుంచి 14 శాతానికి కాంట్రిబ్యూషన్ పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మాణయ్య, చంటి, నర్సింహులు, శ్రీనివాస్, రామకృష్ణ, మధు మోహనకృష్ణ, వెంకట్‌రామన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తీలో చేపట్టిన యూజీడీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయించేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కాంగ్రెస్ కమిటీని ప్రక్షాళన చేయాలి

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బేగ్ వహీద్ మక్బూల్ అన్నారు. కంది మండల కేంద్రంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి సక్రమంగా పనిచేయకపోవడంతోనే ఆశించిన స్థాయిలో పార్టీకి ఓట్లు రాలేవని తెలిపారు. పార్టీ పటిష్టత కోసం డీసీసీ అధ్యక్షురాలు పట్టించుకోలేదని ఆరోపించారు. గతంలో జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న జగ్గారెడ్డి పార్టీ కోసం పనిచేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ సీట్లను కైవసం చేసుకునేందుకు డీసీసీని ప్రక్షాళన చేసి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు అవకాశం కల్పించాలని ఆ పార్టీ అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రఘురామ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బేగ్‌వహీద్ మక్బూల్

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కుమారుడు అదృశ్యం కావడంతో తల్లి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని హరివిల్లు టౌన్‌షిప్‌కు చెందిన యాదమ్మ కుమారుడు నరేశ్‌రెడ్డి (30)మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి సామగ్రి సద్దుకొని వెళ్లిపోయాడు. తల్లి యాదమ్మ ఫోన్ చేసి అడగగా నేను సమస్యలో ఉన్నాను అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. కుమారుడి కోసం యాదమ్మ స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నరేశ్‌రెడ్డి

పురాతన ఆనవాళ్లను తొలగించొద్దు



పనులను అడ్డుకుంటున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో ఉన్న 55 సర్వే నంబర్‌లో భూమిని గతంలో ఆయా పరిశ్రమలకు కేటాయించారు. ప్రసుతం ఈ స్థలంలో చదును పనులు జరుగుతున్నాయి. కాగా ఇదే భూమిలో పురాతన వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆనవాళ్లు ఉన్నాయి. ఈ ఆనవాళ్లను తొలగిస్తుండటాన్ని స్థానిక నాయకులు నరేందర్, శ్రీకాంత్ తదితరులు అడ్డుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

'రైతు భరోసా'కు రేపే గడువు

కంగ్టి(నారాయణఖేడ్): రైతు బరోసా పథకం కోసం నూతనంగా పాస్‌బుక్ పొందిన రైతులు ఈ నెల 12వ తేదీ వరకు ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు సమర్పించాలని రైతులకు సూచించారు.

ఆహ్వాన పత్రిక అందజేత

నారాయణఖేడ్: అయోధ్యలో ఈ నెల 22న నిర్వహించనున్న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొనేందుకు అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌కు బుధవారం అన్య క్షేత్రాల బాధ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో దిలీప్‌పాటిల్, ప్రసాద్, సుభాష్, రామకృష్ణ, ప్రశాంత్, సంతోష్, నర్సింహులు, జగదీష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మునిపల్లి(అందోల్): పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, సంగమేశ్వర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిద్ధేశ్వర్, కిష్టయ్య, హేమసుందర్, సత్యనారాయణ, మహేందర్, వెంకటేశం, సునీల్, రవి పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు